స్థానిక సంస్థల్లోనూ విజయం సాధిస్తాం


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: ప్రజామద్దతుతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ సరళిపై బుధవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్ అధ్యక్షతన వైఎన్నార్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మెజార్టీ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు సొంత పార్టీని గాలికొదిలేసి బీజేపీకి మేలు చేయడంతోనే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించారన్నారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు పార్టీ నేతలు మరింత శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ , సీనియర్ మహిళా నాయకురాలు మైలారం సులోచన, కౌన్సిలర్ అమృత, శంషుద్దీన్, లింగంయాదవ్, శ్రీధర్‌యాదవ్, అక్రమ్‌ఖాన్, బాత్కు నర్సింగ్, సురేందర్, అఫ్రోజ్, ప్రవీణ్ యాదవ శివనాథ్‌గౌడ్, మహేష్, శ్రీధర్, కొంకర రాజు తదితరులు పాల్గొన్నారు.

కలిపేస్తారా..కొనసాగిస్తారా..?

● ఔటర్ లోపలి శివారు పంచాయతీ ప్రజల ఆందోళన ● ఆయా గ్రామాల వివరాల సేకరణలో అధికారులు బిజీ



శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్ లోపల ఉన్న మున్సిపాలిటీ శివారు ప్రాంత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తారా.. మున్సిపాలటిలో విలీనం చేస్తారా అన్న అంశంపై ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ విస్తరణలో భాగంగా ఔటర్ లోపలి పంచాయతీల విలీనం జరుగుతుందని ఇటీవల వచ్చిన వార్తలతో ఆయా గ్రామాల ప్రజల్లో బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో బహదూర్‌గూడ, రషీద్‌గూడ, చిన్న గోల్కొండ, హమీదుల్లానగర్ పంచాయతీలు ఔటర్ రింగు రోడ్డు లోపలి ప్రాంతంలో ఉన్నాయి. వీటిని ముందుగా స్థానికంగా ఉన్న శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేయనున్నట్లు గత కొన్ని రోజులుగా పుకార్లు షికారు చేస్తున్నాయి. వీటితో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఔటర్ లోపలి పంచాయతీలను అభివృద్ధి చేయడానికి వీలుగా గ్రేటర్‌లో విలీనం చేస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక పంచాయతీల పరిధిలోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పన్నుల భారం..

మున్సిపాలిటీలో విలీనం చేస్తే పన్నుల భారం పెరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆయా పంచాయతీలకు పెద్దగా ఆదాయ వనరులు లేకపోగా.. మున్సిపాలిటీలో కలిపితే అభివృద్ధి జరుగుతుందని కొందరు భావిస్తున్నారు. కానీ సామాన్య ప్రజలు పన్నుల కారణంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి బిల్లులు మోపెడు..

ఔటర్ వెలుపలి గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీరు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం పంచాయతీలు నామమాత్రపు పన్ను వసూలు చేస్తున్నాయి. అయితే ఔటర్ లోపలి పంచాయతీలు రషీద్‌గూడ, హమీదుల్లానగర్, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ పరిధిలోని గ్రామాలకు మెట్రో వాటర్ వరర్క్స్ నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం భారీగా నీటి బిల్లులు జారీ అవుతున్నాయి. ఆయా పంచాయతీలు ఇప్పటికే రూ.లక్షల్లో నీటి బిల్లుల బకాయిలు ఉన్నాయి. మున్సిపాలిటిలో విలీనం చేస్తే ఆస్తి పన్నుల పెంపుతో పాటు నీటి బిల్లులు కూడా పెరుగుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విలీనం చేస్తే ఇబ్బందులే..

ఔటర్ లోపలి పంచాయతీలను మున్సిపాలిటీలో విలీనం చే సే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి. అభివృద్ధి సంగతి పక్కనపెడితే పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

– రాణి రవి, మాజీ సర్పంచ్, రషీద్‌గూడ

వివరాలు సేకరిస్తున్నారు..

పంచాయతీల విలీనంపై ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఔటర్ లోపల ఉన్న పంచాయతీల వివరాలు సేకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని జనాభా, పంచాయతీల ఆదాయ, వ్యయాల వివరాలు జిల్లా అధికారులకు నివేదిస్తున్నాం.

– ఉషాకిరణ్, ఎంపీఓ, శంషాబాద్.

ఎంపీలకు సన్మానం


మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను సత్కరించిన మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు


మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సన్మానించిన మణికొండ మున్సిపల్ నాయకులు


కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించిన ఎంఆర్‌పీఎస్ నాయకులు

మణికొండ: చేవెళ్ల, మహబూబ్‌నగర్, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి భారీ మెజార్టీలతో గెలుపొందిన ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, రఘునందన్‌రావులను మణికొండ మున్సిపాలిటీ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు పి.గణేష్ మాదిగల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. వారి నివాసాలకు వెళ్లి ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఎంపీలను కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సీహెచ్. ఇందిర, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యులు జె.సిద్ధప్ప, జె.లక్ష్మీరాములు, నాయకులు కె.శ్రీనివాస్ రెడ్డి, ఎం.నగేష్‌యాదవ్, అనితాదేవి, నర్సింగ్‌రావులు పాల్గొన్నారు. చేవెళ్ల ఎంపీని ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, కె.శంకర్‌మాదిగ, ఆర్.బాబు, పి.నర్సింహ, కె.జగన్ మాదిగ ఉన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


ఎర్రకుంట పూడికతీత పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదర్షాకోట్‌లోని ఎర్రకుంట పూడిక తీత పనులను కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకుడు టింకురెడ్డి, మాజీ ఎంపీటీసీ రవికాంత్‌రెడ్డి, భాగ్యనగర్ కాలనీ, లక్ష్మినగర్ కాలనీ, రఘురాంనగర్ కాలనీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ పూడికతీతతో హైదర్షాకోట్ పరిధిలోని వివిధ కాలనీలకు నీటి ఎద్దడి సమస్య తగ్గుతుందన్నారు. ఎర్రకుంట ఐదు ఫీట్ల లోతు వరకు మట్టిని తవ్వి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని వల్ల ప్రజలు, వివిధ కాలనీల వాసులకు ఎంతో సౌకర్యంగా మారనుందన్నారు. బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు సామగ్రి సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న భీమార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి

బండ్లగూడ: ప్రజలు మరోసారి నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో బుధవారం ఆయనను కలిసి పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించి పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సన్మానం


కొండా విశ్వేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి బండారి బాలకృష్ణ, ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ చారి, పద్మావతి, స్వప్న రెడ్డి, శ్రీనివాస్, శివ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా చర్యలు


కాళికానగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలు నిండిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, వరద నీటి ప్రవాహాన్ని సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని కాళికానగర్, ఓంనగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలో ఉన్న సిల్ట్(మట్టి) తొలగిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలు సైతం అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. డ్రైనేజీల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, మట్టిని వేయరాదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్ సావిత్రి, డ్రైనేజీ టీం కాళీదాసు, సంతోష్, ఓంనగర్ కాలనీ ప్రెసిడెంట్ నవీన్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మణికొండ: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణ, కాలనీలు, రోడ్ల పక్కన వీలైనన్ని ఎక్కువ మొక్కలను పెంచి పర్యావరణాన్ని పెంపొందించాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుడా కాలనీలో రోడ్ల పక్కన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల తరపున ప్రతి సంవత్సరం వీలైనన్ని మొక్కలను నాటుతున్నామన్నారు. వాటిని సంరక్షించటంతో పాటు మరిన్ని నాటేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. మనం పీల్చే గాలి పరిశుభ్రంగా ఉండాలంటే మొక్కలు తప్పనిసరి అన్నారు. రాబోయే వర్షాకాలంలో పెద్ద ఎత్తున మొక్కలను నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్‌లు

మణికొండ: పదేళ్లుగా ఆశా వర్కర్‌లుగా పనిచేస్తున్న వారికి పారితోషికాలను పెంచి నిర్ణీత వేతనం అమలు చేయాలని, ఇన్సూరెన్స్ అమలు చేయాలని గండిపేట మండల సీఐటీయు కన్వీనర్ డి. ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మండల ప్రాథమిక ఆరోగ్య అధికారి విమలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సెలవులు కల్పిస్తూ వెంటనే సర్క్యులర్‌ను జారీ చేయాలన్నారు. ఏటా 20 రోజులు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలన్నారు. ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలన్నారు. వారు ఇప్పటికే పలు శిక్షణలు పొందారని, మరో మారు పరీక్షలు నిర్వహించాలనుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, కవిత, అరుణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

అత్తాపూర్: చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో భాజపా అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల లాల లజపత్‌రాయ్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. శక్తి కేంద్రంలోని మూడు బూత్‌లలో భాజపా 1410 ఓట్లు లీడ్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గ ప్రసాద్, రంథీర్ సింగ్, చరణ్, ప్రసాద్, రామమూర్తి, లక్ష్మీనారాయణ, సుందర్ అంకుర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి


మొక్కలు నాటుతున్న టీఈఎస్‌సీఓబీ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ రావు, ఐసీఎం సంస్థ డైరెక్టర్ డాక్టర్ గణేషన్

రాజేంద్రనగర్: పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత కలిగిన అంశమని.. దానిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) సంస్థ డైరెక్టర్ డాక్టర్ గణేషన్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాజేంద్రనగర్‌లోని ఐసీఎంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యత పాటించకపోతే అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు నెలకొంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థల సహకార సంస్థలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో టీఈఎస్‌సీఓబీ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ రావు, సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వందన, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



రాజేంద్రనగర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా అడిషనల్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆంజనేయులు మాట్లాడుతూ... ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే విధిగా ప్రతి పౌరుడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన కోరారు. పర్యావరణాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవన విధానంలో పర్యావరణ పరిరక్షణను భాగంగా చేసుకోవాలని సూచించారు. మనవంతు బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ 11,12 మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తులు ఎస్ఎంటీ నీలం, రాజ్ కిరణ్, రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం వెంకట్ రెడ్డి, కార్యదర్శి ఎల్.శ్రీధర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రవి కాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్తను బెదిరించేందుకు..

ఎలుకల మందు తాగిన మహిళ....

రాజేంద్రనగర్: పక్కింటి మహిళ చెప్పిన మాటలు విని భర్తను బెదిరించేందుకు ఓ మహిళ ఎలుకల మందు తాగిన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ ప్రాంతంలో సామెల్, గోవిందమ్మ (25)లు దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ఇంటి పక్కనే ఉంటున్న ఓ మహిళ సామెల్ మరో స్త్రీతో కనిపించినట్లు గోవిందమ్మతో చెప్పింది. దీంతో భర్తను బెదిరించేందుకు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీనిని గుర్తించిన సామెల్ ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. మర్నాడు పక్కింటి మహిళ వచ్చి గోవిందమ్మను పరామర్శిస్తుండగా సామెల్ ఆమెపై దాడి పాల్పడటంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇరువురి కేసులను నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ ఆటో 5వ వార్షికోత్సవం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 9,10వ డివిజన్ల పరిధిలో చెత్తను సేకరించే ఆటోకు బుధవారం ఐదవ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆటో నడుపుతున్న డ్రైవర్‌తో పాటు సిబ్బంది జవాన్ అందరూ కలిసి ఆటోను శుభ్రం చేసి అందంగా అలంకరించారు. కట్ట మైసమ్మ దేవాలయం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి ఐదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదేళ్ల క్రితం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆటోలో డ్రైవర్ యుగేందర్‌కు అందజేశారు. నాటి నుంచి యుగంధర్ ప్రతి సంవత్సరం ఇదే రోజున ఆటోకు వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు జీవనాధారమైన ఆటోకు ప్రతి సంవత్సరం వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్, మేనేజర్‌తో పాటు కార్పొరేటర్లు లంకల నిఖిలసంగారెడ్డి, ప్రశాంత్, నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జవాన్‌లు జగన్, శ్రీను, స్వామి, భాగ్యమ్మ, మల్లమ్మ, సబితమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


సీబీఐటీ కళాశాలలో మొక్కలు నాటుతున్న పరివ్రత క్లబ్ సభ్యులు

మణికొండ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల పరివ్రత స్టూడెంట్ క్లబ్ ఆధ్వర్యంలో, మణికొండ వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, వాసవీ కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వి.వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వీలైనన్ని మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. ప్రపంచ, వ్యాప్తంగా వాతావరణ సమతుల్యత దెబ్బతినటంతో ఎండలు, చలి, వర్షాలు, తుఫాన్‌లు పెరిగిపోయి మానవాలి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. గాలి, నీరు, ఆక్సిజన్ పెరిగితేనే అన్ని జీవరాశులు జీవించగలుతాయన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్, ఖాళీ స్థలాల్లో వీలైనన్ని మొక్కలను నాటి వాటిని సంరంక్షించాలన్నారు. సీబీఐటీ కళాశాల ఆవరణలో వీలైనన్ని ఎక్కువ మొక్కలను పెంచి వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించటానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో సీబీఐటీ స్టూడెంట్స్ ఎఫైర్స్, ప్రొగ్రెషన్ డైరెక్టర్ డాక్టర్ పీవీఆర్ రవీంద్రారెడ్డి, జాయింట్ డైరెక్రట్ డాక్టర్ కె.జగన్నాథరావు, అధ్యాపకులు డాక్టర్ ఎం. ముకుంద వాణి, డాక్టర్ పీవీ నాగప్రపూర్ణ, డాక్టర్ ప్రసన్నరాణి, డాక్టర్ కె. వినయ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ కె.రమేష్, డాక్టర్ స్వాత్మరామ్, ఎం. భవాని, ఇ. మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, వాసవి కపుల్స్ క్లబ్ కార్యదర్శి తల్లాడ యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కె. నిరీష, రిజియన్‌చైర్మెన్ జి. నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్ సురేష్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మణికొండలో మొక్కలు నాటుతున్న వాసవి క్లబ్ కపుల్స్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణకు అందరి బాధ్యత

అత్తాపూర్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజేంద్రనగర్ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అత్తాపూర్ ఎలిమినేటెడ్ సైట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమి పునరుద్ధరణ ఎడారి కరోనా కరువును తట్టుకునే శక్తి అనే అంశంపై ప్రేరణ పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ వెంకటేష్, వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ రాజేంద్రనగర్ శ్యాంసుందర్ నాయక్, డాక్టర్ దీప జైస్వాల్,శ్రీనివాసులు, యూబీ డి మేనేజర్ ప్రసన్నకుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీకి

ఉత్తమ పర్యావరణ అవార్డు


అవార్డు అందుకుంటున్న మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి రోజు ప్రజలనుంచి వస్తున్న చెత్తను సేకరించి కంపోస్టు ఎరువులుగా మార్చి పర్యావరణానికి మేలు చేస్తున్నందుకు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఎక్సలెన్స్ ఎన్విరాన్‌మెంటల్ పర్‌ఫార్‌మెన్స్ అవార్డు దక్కింది. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌కు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించటం, వాతావరణ సమతుల్యతను పాటించేలా చేయటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అన్ని మున్సిపాలిటీలు ఇదే తరహాలో కాలుష్య రహిత పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. మణికొండ మున్సిపాలిటీకి అవార్డు రావటం పట్ల కమిషనర్ ఆనందం వ్యక్తం చేశారు.